## క్లుప్తంగా

### నల్లా కనెక్షన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఆర్‌ఓజీ శ్రీనివాస్‌రావు

**నేరేడుచర్ల :** నల్లా కనెక్షన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని నేరేడుచర్ల మున్సిపల్ ఆర్‌ఓజీ శ్రీనివాస్‌రావు అన్నారు. వంద రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం నేరేడుచర్ల మున్సిపాలిటీలోని 15వ వార్డులో నల్లా కనెక్షన్ల ఆన్‌లైన్ దరఖాస్తులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. షాపు యాజమానులు ట్రేడ్ లైసెన్స్‌ల కోసం కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, మెప్మా సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

### పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నడిగూడెం గురుకులంలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న వైద్యసిబ్బంది

**నడిగూడెం :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మనోహరి అన్నారు. సోమవారం నడిగూడెం మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల, హాస్టల్ గదుల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయించి మాట్లాడారు. ప్రతి మంగళవారం, శుక్రవారం పాఠశాలల్లో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ హరిసింగ్, పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి, సబ్ యూనిట్ అధికారి సురేందర్, డిప్యూటీ పారా మెడికల్ అధికారి అమర్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, ఏఎన్‌ఎంలు సుజాత, రాధ, ఆశా కార్యకర్తలు లక్ష్మి, సైదమ్మ, గురుకుల పాఠశాల సిబ్బ నాగలక్ష్మి, శైలజ, పీఈటీ శిరీష పాల్గొన్నారు.

### మానవ అక్రమ రవాణాపై అవగాహన

**నడిగూడెం :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సివిక్స్ అధ్యాపకుడు డాక్టర్ కొల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ డి.విజయ నాయక్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్లు డాక్టర్ జానిపాషా, కర్నాటి శ్రీధర్, అధ్యాపకులు కృష్ణ, మహేష్, ఈశ్వర్, వెంకటేశ్వరరావు, ఉపేందర్, నగేష్, మదార్, వీరన్న, శ్రీనివాసరావు, ధనుంజయ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### రామిశెట్టి శ్రీనివాస్‌కు డాక్టరేట్



డాక్టరేట్ పట్టాతో రామిశెట్టి శ్రీనివాస్

**హుజూర్‌నగర్ :** హుజూర్‌నగర్‌కు చెందిన రామిశెట్టి శ్రీనివాస్ అర్థశాస్త్రంలో డాక్టరేట్ పట్టా పొందారు. తెలంగాణలోని గిరిజనుల ఆర్థిక, జీవన స్థితిగతులపై పరిశోధన పత్రం సమర్పించడంతో ఆయనకు డాక్టరేట్ లభించింది. వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో సోమవారం జరిగిన 23వ స్నాతకోత్సవంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అందుకున్నారు. ప్రస్తుతం ఆయన కల్వకుర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ (అర్థశాస్త్రం)గా విధులు నిర్వహిస్తున్నారు. డాక్టరేట్ తీసుకున్న ఆయనకు మిత్రులు సులువ శ్రీను, రమేష్‌రెడ్డి, అంజయ్య, కృష్ణ, రవి అభినందనలు తెలియజేశారు.

### చేపల వేటకు వెళ్లి చెరువులో పడి మృతి



సైదులు (ఫైల్)

**నేరేడుచర్ల :** చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి నేరేడుచర్ల మండలంలో చోటు చేసుకుంది. నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన పర్శనబోయిన సైదులు(47) ఆదివారం రాత్రి సమయంలో నేరేడుచర్ల మండలం దాచారం గ్రామ శివారులోని అతని పొలం వద్ద నారుమడి చూసేందుకు వచ్చాడు. సమీపంలోనే ఎర్రకుంట చెరువు ఉండటంతో అందులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు కాళ్లకు వల చుట్టుకుని నీటిలో పడి మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న అతడి కుమారుడు సంఘటన స్థలానికి వచ్చి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడి కుమారుడు పర్శనబోయిన రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

# మేజర్‌లకు సీసీ లైనింగ్

- గరిడేపల్లి మండలంలో ముమ్మరంగా పనులు
- రూ.52కోట్ల వ్యయంతో ఏప్రిల్ నుంచే లైనింగ్ మొదలు
- ఈ వానాకాలం సీజన్‌లోనే సాగునీరందించాలని లక్ష్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



బోడబండ వద్ద కొనసాగుతున్న లైనింగ్ పనులు



గరిడేపల్లిలో జాన్‌పహాడ్ మేజర్ పనులు..

**గరిడేపల్లి :** మండలంలోని సాగర్ ఎడమ కాలువ పరిధిలోని మేజర్లకు సిమెంట్ కాంక్రీట్(సీసీ) లైనింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో సుమారు రూ.52కోట్ల వ్యయంతో ఈ పనులను నిర్వహిస్తున్నారు. గతంలో సాగర్ ఎడమ కాలువ లైనింగ్ పనులు పూర్తికాగా మేజర్ల పనులు నిలిచిపోయాయి. దీంతో ఈ వానాకాలం సీజన్‌లోనే సాగు నీరందించే లక్ష్యంతో ఈ పనులను ఏప్రిల్ నెలలో మొదలు పెట్టారు.

**జాన్‌పహాడ్ మేజర్ పరిధిలో ఇలా..**

జాన్‌పహాడ్ మేజర్‌కు అనుబంధంగా ఉన్న గరిడేపల్లి మండలంలోని కాలువలు ఎల్–4 మూడు కిలోమీటర్లు, ఎల్–2 మూడు కిలోమీటర్లు, ఎల్–9 7.2 కిలోమీటర్లు, ఎల్–9/ ఎల్–1కు 6.9 కిలోమీటర్లు, ఆర్–2 నాలుగు కిలోమీటర్లు ఎల్–14 ఏడు కిలోమీటర్లు, ఎల్14/ ఎల్–1 ఐదు కిలోమీటర్లు లైనింగ్ పనులు కొనసాగుతున్నాయి. సీసీ లైనింగ్ పనులతో పాటు డిజైన్ ప్రకారం తూములను కూడా ఏర్పాటు చేస్తున్నారు. కాలువల వారీగా ఎన్ని ఎకరాల ఆయకట్టు ఉందో తెలుసుకుని తూములను ఏర్పాటు చేసి గూనలు కూడా వేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే కాలువలకు గండ్లు పడకుండా మండలంలోని చివరి భూములకు సాగునీరు అందనుంది. రైతుల ఇబ్బందులు తొలగిపోతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండడంతో బోర్లు, బావులు, చెరువుల కింద రైతులు వరి విత్తనాలు చల్లుతున్నారు. ఇప్పటికే గానుగబండ, సర్వారం, గరిడేపల్లి, పొనుగోడు, కాచవారిగూడెం, కల్మల్పల్లి, తాళ్లమల్కాపురం, ఎల్బీనగర్‌లతో పాటు పలు గ్రామాల్లో దుక్కులను దున్ని వెదజల్లే పద్ధతి ద్వారా వరిసాగుచేశారు. కాలువల ద్వారా ఈనెలలోనే సాగునీరు వదలనున్నారని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు. ఈలోగా మిగిలిపోయిన పనులను కాంట్రాక్టర్లు తక్షణమే పూర్తి చేయాలని మండల రైతాంగం కోరుతోంది.

**చివరి భూములకు సాగునీరు అందుతుంది**



మండలంలోని కాలువలకు సీసీ లైనింగ్ పనులు పూర్తయితే చివరి భూములకు సాగునీరు అందడమే కాకుండా రైతుల కష్టాలు తొలగుతాయి. కాలువలకు గండ్లు పడే అవకాశం ఉండదు. దీంతో వర్షాలు వచ్చినప్పుడు రైతులు భయపడాల్సిన అవసరం ఉండదు. త్వరలోనే సాగర్ నీరు వదిలే అవకాశం ఉన్నందున కాంట్రాక్టర్లు తక్షణమే పనులు పూర్తిచేయాలి.

– మేకల మల్లారెడ్డి, రైతు, పరెడ్డిగూడెం

## ‘స్థానిక’ ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

**కోదాడ:** త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ కోరారు. సోమవారం కోదాడలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైనందన్నారు. ఈ సమావేశంలో సుంకర అజయ్‌కుమార్, ఎస్‌కె.నయీం, నర్సిరెడ్డి, చింతా కవిత, జానకిరామాచారి, భూపాల్‌రెడ్డి, కర్ల సుందర్‌బాబు, మెదల లలిత, రమేష్ పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు చేయూత హర్షణీయం



సైకిళ్ల పంపిణీ అనంతరం విద్యార్థులతో సైదిరెడ్డి, శిరీషాకొండారెడ్డి తదితరులు

**హుజూర్‌నగర్ :** నిరుపేద విద్యార్థులకు చేయూత నివ్వడం హర్షణీయమని మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ మండలం వేపలసింగారంలోని ఆర్సీఎం పాఠశాలలో 20 మంది నిరుపేద విద్యార్థులకు అన్నెం వెంకట్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కోడలు, కుమారుడు, తాజా మాజీ సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి దంపతులు సమకూర్చిన రూ.లక్ష విలువ సైకిళ్లను పంపిణీ చేసి మాట్లాడారు. కరోనా సమయంలోనూ శిరీషాకొండారెడ్డి గ్రామ ప్రజలకు 58 రోజుల పాటు అన్నదానం చేసి, నిత్యావసర వస్తువులు సైతం పంపిణీ చేశారని గుర్తుచేశారు. ఇంకా గ్రామ, విద్యాభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా దాతలను పాఠశాల ప్రిన్సిపాల్ ఉష, ఆర్సీం చర్చి ఫాదర్ అల్లం బాలరెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సారెడ్డి భాస్కర్‌రెడ్డి, నందిరెడ్డి సైదిరెడ్డి, రెక్కల శంబిరెడ్డి, సాముల హరిలీలబ్రహ్మారెడ్డి, ఉదయ్‌భాస్కర్, జోజిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఓబుల్‌రెడ్డి, శంకర్, వెంకటేశ్వర్లు, వీరయ్య, మౌలాలి పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌లను రద్దుచేయాలి



కోదాడరూరల్ : మాట్లాడుతున్న వెంకటయ్య



హుజూర్‌నగర్ : అభివాదం చేస్తున్న ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు

**నేరేడుచర్ల :** కార్మికుల హక్కులను కాలరాసేలా కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని ఆల్ ట్రేడ్ యూనియన్ల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నేరేడుచర్లలోని సీపీఎం కార్యాలయంలో ఆల్ ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. ఈనెల 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో వివిధ ట్రేడ్ యూనియన్లు, వివిధ పార్టీల నాయకులు నీలా రాంమ్మూర్తి, ధీనుంజయనాయుడు, వాసా పల్లయ్య, ఇంజమూరి వెంకటయ్య, మర్రి నాగేశ్వర్‌రావు, కోదమగుండ్ల నగేష్, రావుల సత్యం, చిలక రాజు శ్రీను, కృష్ణవేణి, లక్ష్మి, హుస్సేన్, భిక్షం, భాస్కర్, నవీన్, సంతోష్ పాల్గొన్నారు.

**పది గంటల పనివిధానం వద్దు**

**కోదాడరూరల్ :** కార్మికుల 10 గంటల పని విధానం జీఓను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దుచేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్ వేర్ హౌస్ గోదాం వద్ద మేనేజర్‌కు హమాలీ కార్మికులతో కలిసి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నోటీసును గోదాం ఇన్‌చార్జికి అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో భూక్య పాప నాయక్, బి.సైదా, శ్రీనివాస్, రమేష్, సైదులు, వెంకన్న, రాజారాం పాల్గొన్నారు.

**సార్వత్రిక సమ్మెకు ఎస్‌కేఎం మద్దతు**

**కోదాడరూరల్ :** బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై ఈ నెల 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఆసంఘ జిల్లా కన్వీనర్ దొడ్డ వెంకటయ్య అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని లాల్‌బంగ్లాలో నిర్వహించిన ఆ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంయుక్త సంఘ నాయకులు ములకలపల్లి రాములు, పోటు లక్ష్మయ్య, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, రెమిడాల రాజు, ముత్యాలు, ఉదయగిరి పాల్గొన్నారు.

**సమ్మె పోస్టర్ ఆవిష్కరణ**

**మునగాల:** విద్యుత్ సంస్థలో 25ఏళ్లుగా పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు కోరారు. ఈనెల 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను సోమవారం వారు మునగాలలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు బత్తిని రామారావు, సాయిచంద్, పి.మల్లయ్య, రామాచారి, సైదిరెడ్డి పాల్గొన్నారు.

**సమ్మెను విజయవంతం చేయాలి**

**హుజూర్‌నగర్ :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురువయ్య పిలుపునిచ్చారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని ఇందిరా భవన్‌లో నిర్వహించిన ఆల్ ట్రేడ్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 9న ఆల్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, బిల్డింగ్ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేట్టి ప్రసాద్, బ్లాక్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు అమర్నాథ్‌రెడ్డి, నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు చప్పిడి సావిత్రి, మండల అధ్యక్షుడు ముక్కంటి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

**కోదాడరూరల్ :** ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంతోపాటు ఆ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలను ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజుమాదిగ ఆధ్వర్యంలో సోమవారం కోదాడ పట్టణం ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేశారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులను సన్మానించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జాతీయ నాయకులు కర్ల విజయరావు, ఏపూరి సత్యరాజు, పాతకోట్ల ప్రకాష్, చెరుకుపల్లి శ్రీకాంత్, కుడుముల శ్రీను, కాంపాటి ఉపేందర్, పిడమర్తి బ్రహ్మం, పంది లక్ష్మయ్య, కర్ల కమాన్‌దాదా, పులిబాబు, కొండల్ తదితరులు ఉన్నారు. అలాగే గాంధీనగర్‌లో ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ జిల్లాల అధ్యక్షుడు చింత బాబు మాదిగ, టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ రోడ్డులో నిర్వహించిన వేడుకల్లో కాంపాటి శ్రీను, గంధం యాదగిరి, చీమ శ్రీను, నెమ్మాది సురేష్, పల్లెటి లక్ష్మణ్, బాణాల అబ్రహ్మం, వార్డు మాజీ సభ్యులు గంధం రంగయ్య, కలకొండ ఆదినారాయణ, బల్గూరి హుస్సేన్, నెమ్మాది దేవమణి, కుడముల సైదులు పాల్గొన్నారు.

**అనాథ పిల్లలకు అన్నదానం**

**హుజూర్‌నగర్ :** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పుట్టిన రోజుతోపాటు ఆ సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం హుజూర్ నగర్‌లో కేఎస్‌ఆర్ ఫౌండేషన్, దిల్ యువసేన ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. జీప్సీ అనాథ ఆశ్రమంలోని పిల్లలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కేఎస్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కస్తాల దిల్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మేరిగ అశోక్, మీసాల వీరబాబు, పల్లె క్రాంతి గోపాల్ దాస్ కిరణ్, చింతిరాల సాయి, నవీన్ పాముల పండు, జాషువా, చంటి, పవన్ పాల్గొన్నారు. హుజూర్‌నగర్‌లోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆ సంఘం జెండా ఎగరవేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం ముక్కంటి, పట్టణ అధ్యక్షులు రాము, నాయకులు పి.కాటమయ్య, ఎం.వెంకటేశ్వర్లు, కె.సైదులు, రవీంద్ర, వై.వీరబాబు, నారాయణ, నాగేంద్రబాబు, వీరస్వామి పాల్గొన్నారు.



కోదాడలోని బస్టాండ్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న రాజుమాదిగ

**వేపలసింగారంలో..**

హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారం గ్రామంలో సోమవారం జరిగిన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకల్లో నాయకులు పి.అశోక్ కుమార్, విజయ కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

**నేరేడుచర్ల :** నేరేడుచర్ల మున్సిపల్ పరిధిలోని శివాజీనగర్‌లో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు ఇంజమూరి శ్రీకాంత్, రాష్ట్ర నేత ఇంజమూరి మల్లయ్య, చంద్రయ్య, రాములు, టీఆర్‌ఎస్‌వీ నేతలు రాపోలు నవీన్, ఇంజమూరి రామములు, సామ్రాట్, సతీష్, పున్నయ్య, వెంకన్న, రాజేష్, శంకర్, ఉపేందర్ పాల్గొన్నారు.

**నడిగూడెం, చిలుకూరు:** నడిగూడెం, చిలుకూరు మండలాల్లో సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు ఆ సంఘం ఆవిర్భావ దినోత్సవంతోపాటు, మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరించి కేకులు కట్ చేశారు. నడిగూడెంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో ఎంఈఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి యలమర్తి రాము, మండల అధ్యక్షుడు మొలుగూరి సైదులు, ఎంఎస్పీ మండల కన్వీనర్ మిట్టగణుపుల మోష, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పందిటి నవీన్ కుమార్, ఎంఈఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పాతకొట్ల ప్రకాష్, ఎమ్మార్పీఎస్ నాయకులు దున్నా శ్రీనివాస్, చిలుకూరులో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి కోటేష్, మండల అధ్యక్షుడు మల్లెపంగు సూరిబాబు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

**మఠంపల్లి :** మఠంపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ, మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలను ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంచారు. కార్యక్రమంలో ఆసంఘం మండల అధ్యక్షుడు ఇరుగు ప్రభు, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు మాదిగ, ఎంఈఎఫ్ మండల అధ్యక్షుడు విజయ్ మాదిగ, ఎంజెఎఫ్ మడల అధ్యక్షుడు సుధాకర్‌మాదిగ, మఠంపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు సైదులుమాదిగ, నాయకులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



నేరేడుచర్లలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

**మునగాల:** మండల కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ మండల అధ్యక్షుడు లంజేపల్లి శ్రీను మాదిగ, మాజీ అధ్యక్షుడు లంజేపల్లి పెద్ద శ్రీను మాదిగ, గ్రామ శాఖ అధ్యక్షుడు లంజేపల్లి రవి, ఉపాధ్యక్షుడు నరేందర్, లంజేపల్లి ధనమూర్తి పాల్గొన్నారు.

**మోతె :** మోతె మండల కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఆ సంఘం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మారపంగి రామాంజి, దోసపాటి చిరంజీవి, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి బొడ్డు కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఎరువుల కొరత రానీయొద్దు

**హుజూర్‌నగర్ :** ఈ వానాకాలం సీజన్‌లో రైతులకు ఎరువులు, యూరియా కొరత రానీయొద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయం అనుమాల లింగయ్య భవన్‌లో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నందున ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే కొంతమంది వ్యాపారులు యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. సమావేశంలో యల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు, దేవరం మల్లేశ్వరి, యల్లావుల రమేష్, జడ శ్రీనివాస్,దొంతగాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వీహెచ్‌పీ నాయకుల బైండోవర్ సరికాదు

**కోదాడరూరల్ :** పశువుల అక్రమ రవాణాను అడ్డుకుంటున్న విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ), బజరంగ్‌దళ్ నాయకులను పోలీసులు బైండోవర్ చేయడం సరికాదని బజరంగ్‌దళ్ తెలంగాణ ప్రాంత కోకన్వీనర్ కన్నెబోయిన వెంకట్, జిల్లా అధ్యక్షుడు కారింగుల ఉపేందర్ అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని రామాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అనంతగిరిలో పశువుల అక్రమ రవాణా చేస్తున్న వారిని అడ్డుకున్నందుకు విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయడం ఏంటని ప్రశ్నించారు. దీనిపై కోదాడ డీఎస్పీ విచారణ చేపట్టాలనిన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు కనగాల నారాయణ, యాద నవీన్, రచ్చ సతీష్, వంశీ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు

## రైతాంగ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ సైదులుకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

**నేరేడుచర్ల :** రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నేరేడుచర్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట అఖిల భారత రైతు సమాఖ్య నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య మాట్లాడుతూ రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పరికరాలు, రుణాలు సరైన సమయానికి అందించాలన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సురిగి సైదులుకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌డిడబ్ల్యు కేంద్ర కమిటీ సభ్యురాలు వస్కుల సైదమ్మ, కస్తాల సందీప్, బాబు, గోపపాల్‌దాసు వినయ్, ఇస్మాయిల్, మౌనిక, చరణ్, ఇమ్మానియేలు పాల్గొన్నారు.

### రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలి

**కోదాడరూరల్ :** వానాకాలం సాగు సీజన్ ప్రారంభమైనందున రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియాను అందుబాటులో ఉంచాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు కనగాల వెంకట్రామయ్య డిమాండ్ చేశారు. సోమవారం కోదాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి ఎరువుల సరఫరాపై చేసిన వ్యాఖ్యలతో రైతాంగం గందరగోళానికి గురవుతోందన్నారు. యూరియాను బ్లాక్‌మార్కెట్‌కు తరలించకుండా చూడాలన్నారు. ఆయన వెంట కనగాల నారాయణ, నూనె సులోచన, బొలిశెట్టి కృష్ణయ్య, సీహెచ్.శ్రీనివాస్, మునగాల శ్రీనివాస్ ఉన్నారు.

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి శుభాకాంక్షలు

**నేరేడుచర్ల :** బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు రాంచందర్‌రావును హైదరాబాద్‌లో సోమవారం ఆ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొబ్బా భాగ్యారెడ్డి ఆధ్వర్యంలో నేరేడుచర్ల మండల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాల వెంకటేశ్వర్లు, సత్యనారాయణరెడ్డి, విజయ్‌కుమార్, కొణతం నాగిరెడ్డి, వీరబాబు పాల్గొన్నారు.

### ప్రభుత్వ సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలి

**హుజూర్‌నగర్ :** రైతులు ప్రభుత్వ సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని హుజూర్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్ జక్కుల నరేందర్ యాదవ్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని పీఏసీఎస్ కార్యాలయంలో స్థానిక రైతులకు సబ్సిడీపై కంది, మినుము విత్తనాలను పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఏడీఏ రవినాయక్, ఏఓ ప్రియతమ్ కుమార్, ఏఈఓలు రమ్య, పర్వీన్ పాల్గొన్నారు.

### నిజాముద్దీన్ కుటుంబానికి జూలకంటి పరామర్శ

**హుజూర్‌నగర్ :** మండలంలోని లింగగిరిలో ఇటీవల మృతి చెందిన జిల్లా కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడు ఎండి నిజాముద్దీన్ కుటుంబ సభ్యులను సోమవారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పరామర్శించారు. నిజాముద్దీన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పల్లె వెంకట్ రెడ్డి, బ్రహ్మం, సైదులు, హుస్సేన్, శీలం శ్రీను, వీరస్వామి, వెంకన్న పాల్గొన్నారు.

### మృతుడి కుటుంబానికి చేయూత

**గరిడేపల్లి :** వారం రోజుల క్రితం మృతిచెందిన గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామానికి చెందిన తుంగతుర్తి పుల్లయ్య కుటుంబానికి సోమవారం శ్రీ కనకదుర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 50కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ కనకదుర్గ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ‘సాగర్ సిమెంట్’కు ఫైవ్‌స్టార్ రేటింగ్ అవార్డు



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సమ్మిడి సిద్ధారెడ్డి తదితరులు

**మఠంపల్లి, మేళ్లచెరువు :** గనుల తవ్వకంలో అత్యుత్తమ ప్రమాణాలు పాటించినందుకు 2023–24 సంవత్సరానికి గాను మఠంపల్లి సమీపంలోని సాగర్ సిమెంట్స్ పరిశ్రమకు వరుసగా మూడవ సారి ఫైవ్‌స్టార్ రేటింగ్ అవార్డు దక్కింది. అలాగే మేళ్లచెరువు మండలకేంద్రం పరిధిలోని మైహోం తోపాటు రామాపురం పరిధిలోని రెయిన్ సిమెంట్ పరిశ్రమలకు కూడా ఫైవ్‌స్టార్ రేటింగ్ అవార్డులు లభించాయి. సోమవారం రాజస్తాన్ రాజధాని జైపూర్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా సాగర్‌సిమెంట్ పరిశ్రమ తరపున సమ్మిడి సిద్ధారెడ్డి, బీఎస్‌పీ రాజు, సుబ్రహ్మణ్యం, అలాగే మైహోం పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ జూపల్లి రంజిత్‌రావు, యూనిట్ హెడ్ శ్రీనివాసరావు, రెయిన్ సిమెంట్ పరిశ్రమ జనరల్ మేనేజర్ వర్క్స్ సీతారామిరెడ్డి, జనరల్ మేనేజర్ మైన్స్ శ్రీనివాస్‌రెడ్డి అవార్డులు అందుకున్నారు.

## మత సామరస్యానికి ప్రతీక.. మొహర్రం



మేళ్లచెరువు : వెల్లటూరులో పీర్ల ఊరేగింపు



నడిగూడెం : వేడుకల్లో పాల్గొన్న గౌరీశంకర్

**నడిగూడెం, మునగాల, మేళ్లచెరువు :** మత సామరస్యానికి ప్రతీక మొహర్రం అని సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. సోమవారం నడిగూడెంలో జరిగిన చివరి రోజు మొహర్రం వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వేపూరి తిరుపతమ్మ, వల్లెపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మునగాల మండలం జగన్నాథపురం, మేళ్లచెరువు మండలం వెల్లటూరులో మొహర్రం వేడుకలు నిర్వహించారు.

### నిబంధనలకు విరుద్ధంగా నిద్రమాత్రలు విక్రయం

- మెడికల్‌షాప్ యజమాని అరెస్ట్

**కోదాడరూరల్ :** నిబంధనలకు విరుద్ధంగా అల్ప్రాజోలమ్ అనే నిద్రమత్తు మాత్రలను విక్రయించిన మెడికల్ షాప్ యజమానితో పాటు కొనుగోలు చేసిన వ్యక్తిని సోమవారం నడిగూడెం పోలీసులు అరెస్ట్ చేశారు. కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నడిగూడెం మండల కేంద్రంలో మెడికల్ షాప్ నిర్వహిస్తున్న నకిరేకంటి భిక్షమయ్య ఇన్వాయిస్ బిల్లులు లేకుండా, ఎలాంటి డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ఖమ్మం చెందిన ఎండీ షాదాబ్ ఖాన్‌కు అల్ప్రాజోలమ్ అనే నిద్రమాత్రలు విక్రయించాడు. పక్కా సమాచారం మేరకు నడిగూడెం ఎస్‌ఐ మెడికల్ షాప్‌పై దాడులు నిర్వహించి అమ్మిన, కొనుగోలు చేసిన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి రూ.3700 విలువ చేసే 45 మాత్రల షీట్స్, రెండు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ అజయ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.